సాక్షి మెదక్

గురువారం । 4 । జనవరి । 2024



'యోగ'ం లేదా..?

ప్రస్తుత సమాజంలో మనుషులు ఉరుకులు.. పరుగుల జీవితం గడుపుతున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం లేదు. వివరాలు 8లో ▸



రారండోయ్ వేడుక చూద్దాం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం, జాతరకు సర్వం సిద్ధం అవుతుంది. వివరాలు 8లో ▸



విద్యుత్ సమస్యల పరిష్కారానికి..

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ కృష్ణారావు అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సావిత్రిబాయికి నివాళి



సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెదక్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం జరిపారు. ఆమె గొప్ప సంఘసంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రిగా రాణించారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ అన్నారు. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మారన్నారు. మహిళల సకల హక్కుల కోసం పోరాడిన ధీశాలి పూలేనని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గూడూరి ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ దాయర రవి, ఇస్మాయిల్, రమేశ్, అమీర్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పోస్ట్, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి బుధవారం తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు కుల, ఆదాయ సర్టిఫికెట్స్, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్, బోనాఫైడ్ జిరాక్స్ పత్రాలను జత చేయాలని తెలిపారు. ఈపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్‌లో ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ స్కాలర్‌షిప్ దరఖాస్తులకు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు.. విద్యార్థులకు సహకరించాలని తెలిపారు.

అవగాహన తప్పనిసరి

మెదక్: ప్యానల్ లాయర్లు అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ లక్ష్మీశారద పేర్కొన్నారు. బుధవారం మెదక్‌లోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్యానల్ లాయర్లతో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో చైల్డ్ రైట్స్ , ఉమెన్ యాక్ట్, సీనియర్ సిటిజన్స్ యాక్ట్ , యాసిడ్ అటాక్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్స్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల స్నానానికి వెళ్లి.. అనంతలోకాలకు

నీట మునిగి యువకుడి మృతి



రాజు (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): అంత్యక్రియలు ముగిశాక చెరువులో స్నానానికి వెళ్లిన యువకుడు నీట మునిగి మృతిచెందాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం సూరారంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పద్మగల్ల పోచమ్మ మంగళవారం మృతిచెందగా సాయంత్రం అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. ఇదే గ్రామానికి చెంది న దిద్దు రాజు(35) ఆ క్రతువు పూర్తయిన తర్వాత స్నానం చేసేందుకు చెరువులోకి దిగి గల్లంతయ్యాడు. తోటి వారు అతడి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం గజ ఈతగాళ్లు గాలించగా మృతదేహం లభ్యమైంది. ఆ మేరకు పోలీసులకు కుటుంబసభ్యులు సమాచారం అందించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

రైలు కింద పడి వ్యక్తి మృతి



పిట్ల భూపాల్

రామాయంపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఒక వ్యక్తి రైలు కింద పడి ఆతహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్ఐ తావూనాయక్ కథనం ప్రకారం... సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం కోనాయపల్లికి చెందిన పిట్ల భూపాల్ (32), పావని భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా అతను ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మంగళవారం సాయంత్రం తన అత్త వారి స్వగ్రామమైన రుద్రారం గ్రామానికి వెళ్లాడు. అక్కడ ఉంటున్న తన కూతురుతో మాట్లాడి నేరుగా అక్కన్నపేటకు చేరుకున్నాడు. అదేరోజు రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● లారీ డ్రైవర్ల నిరసన



హిట్ అండ్ రన్ కేసు.. నిబంధనలను వెంటనే ఎత్తేయాలని బుధవారం పెద్దశంకరంపేటలో లారీ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనం నడిపే డ్రైవర్ ఘటన స్థలం నుంచి పారిపోతే అతడికి 10 ఏళ్ల జైలుశిక్ష, రూ.7 లక్షల జరిమానా విధించేలా తీసుకొచ్చిన నిబంధనను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఒక డ్రైవర్ ఏడాదంతా కష్ట పడినా గానీ రూ. లక్ష సంపాదించడం కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు.

-పెద్దశంకరంపేట(మెదక్)

● రంగోత్సవ్‌లో సత్తా



రంగోత్సవ్ ఆన్‌లైన్ చిత్రలేఖన పోటీల్లో 12 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆగస్టులో జాతీయస్థాయి పోటీలు జరుగగా మనోహరాబాద్ ఉన్నత పాఠశాలకు చెందిన 60 మంది సత్తా చాటారు. వీరిలో 9 మందికి గోల్డ్, మిగతా వారు బ్రోంజ్ పతకాలు, ప్రశంసా పత్రాలను బుధవారం అందుకున్నారని హెచ్‌ఎం రెహానా సుల్తానా తెలిపారు.

- మనోహరాబాద్(తూప్రాన్)

ఎస్పీగా బాలస్వామి

- ప్రస్తుతం హైదరాబాద్ సౌత్‌జోన్ డీసీపీ బాధ్యతల నిర్వహణ
- గతంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీగా పనిచేసిన అనుభవం



మెదక్: జిల్లా ఎస్పీగా బి.బాలస్వామి బుధవారం నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఆయనను జిల్లా కేటాయించారు. ప్రస్తుతం హైదరాబాద్ సౌత్‌జోన్ డీసీపీగా పనిచేశారు. ఇక్కడ మొన్నటి వరకు విధులు నిర్వర్తించిన ఎస్పీ రోహిణి ప్రియదర్శిని హైదరాబాద్ నార్త్‌జోన్‌కు బదిలీ కావడం విదితమే. బాలస్వామికి జిల్లాతో అనుబంధం ఉంది. గతంలో మెదక్ అదనపు ఎస్పీగా ఆయన విధులు నిర్వర్తించారు. ఇప్పుడు ఎస్పీగా వస్తున్నారు.

మెగా ఆశలు

- టీచర్ల భర్తీకి సర్కార్ ప్రకటన
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
- జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు 525
- మూతపడిన బడులు 24



మెదక్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఉపాధ్యాయ శిక్షణ పొందిన నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికల ముందు మెగా డీఎస్సీని నిర్వహిస్తామని నిరుద్యోగులకు హామీనిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. విద్యాశాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి ఖాళీల భర్తీకి మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించారు.

గతేడాది సెప్టెంబరులో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) నిర్వహించేందుకు ప్రకటన జారీ చేసింది. నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ కొనసాగుతుండగానే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలన్న వారి ఆశలు అడిఆశలయ్యాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై దృష్టి సారించడంతో నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఆరేళ్లుగా నియామకాలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయ ఖాళీలతో ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు.

కాగా మెదక్ జిల్లాలో మొత్తం 3,959 మంది ఉపాధ్యాయులు పోస్టులుండగా ప్రస్తుతం 3,434 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 525 పోస్టులు ఖాళీ ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులు

స్కూల్ అసిస్టెంట్స్	284
ప్రైమరీ టీచర్స్	58
లాంగ్వేజ్ పండిత్	30
సెకండ్ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ)	153
మొత్తం	525



నిజాంపేట మండలంలో మూతపడిన పాఠశాల

మూతపడిన పాఠశాలలివే..

జిల్లావ్యాప్తంగా నాలుగేళ్లుగా 27 పాఠశాలలు మూతపడ్డాయి. ఈ ఏడాది 3 పాఠశాలలు తెరచుకున్నాయి. మరో 24 పాఠశాలలకు తాళాలు వేసే ఉన్నాయి. ఇక్కడ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని మరో పాఠశాలలో వారిని చేర్చారు. ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగింది. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం మూత పడిన బడులను వెంటనే తెరవాలని, పాఠశాలలు లేని గ్రామం రాష్ట్రంలో ఉండకూడదని భావిస్తున్నది. దీంతో మూత పడిన పాఠశాలలు సైతం తెరచుకోనున్నాయి. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయబోతుండటంతో జిల్లాలో పోస్టుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వానిది మంచి నిర్ణయం



కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యాశాఖను గాడిలో పెట్టేందుకు యత్నిస్తోంది. అందులో భాగంగా మెగా డీఎస్సీ నిర్వహణ ప్రక్రియతోపాటు మూతపడిన పాఠశాలలను సైతం తిరిగి కొనసాగించేందుకు తీసుకున్న నిర్ణయం మంచిదే. డీఎస్సీలో పోస్టులు పెరగడం వల్ల నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుంది. అలాగే విద్యార్థులను సర్కార్ బడుల్లోకి రప్పించేలా కార్యాచరణను రూపొందించాలి. ఇందుకనుగుణంగా సర్కార్ బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– ఎల్ మల్లారెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు



సికింద్లాపూర్ పంచాయతీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం శాయశక్తులు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు చేరేందుకు పని చేస్తానన్నారు. సికింద్లాపూర్ పంచాయతీ భవనం అధునాతనంగా నిర్మించిన సర్పంచ్ సుధాకర్‌రెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. ఇతర పంచాయతీల్లోనూ నూతనంగా నిర్మిస్తున్న భవనాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ భాస్కర్‌రావు, ఉప సర్పంచ్ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి రాజు, బీఆర్ఎస్ నాయకులు చంద్రగౌడ్, రమణగౌడ్, యాదగౌడ్, మైపాల్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, లక్ష్మణ్, నర్సింహారెడ్డి, శ్రీశైలం, చింత స్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణలో నిర్లక్ష్యం తగదు



మహిళకు రశీదు అందజేస్తున్న శ్రీనివాస్

వెల్దుర్తి(తూప్రాన్): ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి అలసత్వం వహించరాదని ప్రజాపాలన నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అన్నారు. వెల్దుర్తి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయహస్తం కార్యక్రమం ఈనెల 6వ తేదీ వరకు కొనసాగుతోందన్నారు. అర్హులైన వారు తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలన గ్రామసభ కార్యక్రమం ద్వారా స్వీకరిస్తున్న దరఖాస్తులన్నింటినీ రోజువారీగా డిజిటలైజేషన్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పథకాలతోపాటుగా వచ్చే ఇతర దరఖాస్తులనూ స్వీకరించాలని సూచించారు. అనంతరం ప్రజాపాలన కేంద్రంలో కౌంటర్లవారీగా వచ్చిన దరఖాస్తులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బైపాస్‌పై భగ్గుమన్న రైతులు

- రోడ్డు నిర్మాణానికి యత్నిస్తే ప్రతిఘటిస్తాం
- అధికారులకు బాధితుల హెచ్చరిక



మ్యాపును పరిశీలిస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): తమ భూముల నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణానికి అంగీకరించమని బాధిత రైతులు అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. రామాయంపేట మీదుగా నిర్మిస్తున్న మెదక్–ఎల్కతుర్తి జాతీయ రహదారి (765 డీజీ) బైపాస్ రోడ్డులో రైతులు కోల్పోతున్న భూములను బుధవారం ఇన్‌చార్జి ఆర్డీఓ అంబాదాస్ రాజేశ్వర్ పరిశీలించారు. ఈ నిర్మాణం పనులను కొంతకాలంగా రైతులు అడ్డుకుంటున్న క్రమంలో ఆర్డీఓ, జాతీయ రహదారులశాఖ అధికారులు భూములను పరిశీలించారు. అనంతరం అధికారులతో బాధిత రైతులు మాట్లాడారు. నర్సాపూర్, మెదక్ పట్టణాల్లో బైపాస్ రోడ్లు నిర్మించకుండా పట్టణాల మధ్యలో నుంచే రోడ్డు వేస్తున్నారని చెప్పారు. రామాయంపేటలో మాత్రం బైపాస్ నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆలోచనను విరమించుకొని పాత రోడ్డు మార్గం ద్వారానే జాతీయ రహదారి నిర్మించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. తమ విన్నపాన్ని బేఖాతరు చేసి బైపాస్ రోడ్డు నిర్మిస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమని తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఆర్డీఓ హామీఇచ్చారు. తొలుత జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మించనున్న భూములను, మ్యాప్‌ను పరిశీలించారు.

ప్రతిభ వెలికితీతకే 'ఇగ్నైట్ ఫెస్ట్'



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

నర్సాపూర్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇగ్నైట్ ఫెస్ట్ దోహదపడుతుందని గిరిజన గురుకుల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ సంపత్ కుమార్ చెప్పారు. ఎస్టీ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీ గురుకుల పాఠశాల, కాలేజీ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన రీజినల్ స్థాయి ఇగ్నైట్ ఫెస్ట్‌లో ఆయన ప్రారంభోత్సవ ఉపన్యాసం చేశారు. ఫెస్ట్‌లో మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని ఎస్టీ గురుకులాల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. వారికి 22 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వాటిలో 439 మంది బాలికలు, 461మంది బాలురు పాల్గొంటున్నారని వివరించారు. ఈ ఫెస్ట్ వల్ల వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ ఫెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి, 9వ వార్డు కౌన్సిలర్ సునీత తెలిపారు.

18 నుంచి వైజ్ఞానిక ప్రదర్శన

మెదక్ కలెక్టరేట్: ఈనెల 18,19వ తేదీల్లో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు డీఈఓ రాధాకిషన్ బుధవారం తెలిపారు. రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణ సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రదర్శనకు ఎంపిక చేసిన అంశాలు 1) సమాజం కోసం సైన్స్, సాంకేతిక, ఉప అంశాలు 1)ఆరోగ్యం, 2), పర్యావరణ అనుకూల జీవనశైలి, 3), వ్యవసాయం, 4)కమ్యూనికేషన్, రవాణా, 5) కంప్యూటేషనల్ థింకింగ్ అంశాల్లో విద్యార్థులు ఎగ్జిబిట్స్, మోడల్స్ తయారు చేయాలని పేర్కొన్నారు. వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డిని 83285-99157 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

6న అథ్లెటిక్స్ ఎంపికలు

సిద్దిపేటజోన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి వెంకట్ స్వామిగౌడ్ తెలిపారు. గుజరాత్ అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ, అంతర్ జిల్లా అథ్లెటిక్స్ అండర్ 14, అండర్ 16 విభాగంలోను, అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే సబ్ జూనియర్ అండర్ 8, 10, 12, 14 విభాగాల్లో బాలబాలికలకు సంబంధించి ఎంపిక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. వివరాలకు 630 4869887, 8465868036, 97040 61543 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన



అల్లాదుర్గం: దరఖాస్తును పరిశీలిస్తున్న రాజర్షిషా

కలెక్టర్ రాజర్షిషా

టేక్మాల్(మెదక్): ప్రజా సమస్యలు తీర్చేందుకే ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. బుధవారం టేక్మాల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐదు సంక్షేమ పథకాలకు ఒకే దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూ సమస్యలు ఎన్ని ఉన్నా గానీ త్వరలో మార్పులు చేసుకునే అవకాశం త్వరలో వస్తుందన్నారు. దరఖాస్తుదారులకు ఇబ్బంది కలుగకుండా కౌంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తుల వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసుకుని రశీదులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబ, ఎస్ఐ రమేష్, సర్పంచ్ లచ్చాగౌడ్, ఎంపీటీసీ రాంబాయి తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన పెండింగ్ పనులన్నీ వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. బుధవారం టేక్మాల్ మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలను సందర్శించారు. సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి శుద్ధి యంత్రాన్ని, సోలార్‌ను బాగు చేయించాలన్నారు. అంతకు ముందు కేజీబీవీలో సావిత్రి బాయి జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

అల్లాదుర్గం(మెదక్): అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఇచ్చే అన్ని రకాల దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ అర్జీలను నింపి కౌంటర్లలో ఇవ్వాలన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థినులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని వారితో కలిసి తిన్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంకు నాచగిరీశుని ఆశీస్సులు

- స్వామివారి జ్ఞాపిక అందజేత



జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ అన్నపూర్ణ

వర్గల్‌(గజ్వేల్‌): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను బుధవారం నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం సహాయ కమిషనర్‌ ఎస్‌.అన్నపూర్ణ ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది కలిశారు. హైదరాబాద్‌ ప్రగతి భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి డిప్యూటీ సీఎం దంపతులకు స్వామి ఆశీస్సులు, శేష వస్త్రం, జ్ఞాపిక అందజేశారు.

చిరుత కలకలం

- దామర్‌గిద్దా, బాన్సువాడ గ్రామ శివారులో సంచారం

కంగ్టి(నారాయణఖేడ్‌): మండలంలోని దామర్‌గిద్దా, బాన్సువాడ గ్రామ శివారులో బుధవారం చిరుత కనిపించినట్లు వదంతులు రావడంతో వ్యవసాయ పనులు మానుకొని రైతులు, పశువుల కాపర్లు గ్రామాల్లోకి పరుగులు పెట్టారు. దామర్‌గిద్దకు చెందిన ఓ రైతు దగ్గరి నుంచి చూసినట్లు పేర్కొన్నారు. కాగా గ్రామస్తులు కొందరు కట్టెలు తీసుకొని శివారులో వెతకగా కనించలేదు. ఈ విషయం నారాయణఖేడ్‌ ఫారెస్ట్‌ రేంజ్‌ ఆఫీసర్‌ చంద్రశేఖర్‌కు సమాచారం ఇవ్వగా మూడు చిరుత పులులు సంచరిస్తున్నట్లు తెలిపారు. అటవీ అధికారులను పంపించి గాలింపు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

పార్లమెంట్‌ ఎన్నికలకు సిద్ధం కావాలి

తూప్రాన్‌: త్వరలో జరగనున్న పార్లమెంట్‌ ఎన్నికలకు కార్యకర్తలు సమాయత్తం కావాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారని బీఆర్‌ఎస్‌ మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుగౌడ్‌ బుధవారం తెలిపారు. హైదరాబాద్‌ కోకాపేటలో ఉన్న తన నివాసంలో ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆంజనేయులు గౌడ్‌, మన్నే నవీన్‌ యాదవ్‌, జింక శేఖర్‌, పిట్ల కరుణాకర్‌, జిన్న కృష్ణ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.


వెళ్తున్న బస్సులో నుంచి దిగడంతో..

- మహిళకు గాయాలు



మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

శివ్వంపేట(నర్సాపూర్‌) : ఆర్టీసీ బస్సు వెళ్తుండగానే దిగడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి టౌర్య తండాకు చెందిన పట్లోత్‌ దేవ్లి గూడూర్‌ గ్రామానికి వెళ్లేందుకు ఉసిరికపల్లి బస్‌స్టేజీ వద్ద గజ్వేల్‌ నుంచి సంగారెడ్డి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కింది. గూడూర్‌ స్టేజీ వద్ద బస్సు ఆగిన అనంతరం ముందుకు వెళ్తుంది. అక్కడ దిగాల్సిన పట్లోత్‌ దేవ్లి కొద్దిదూరం వెళ్లాక కండక్టర్‌తో చెప్పడంతో బస్సు నిలిపేందుకు బెల్‌ కొట్టారు. బస్సు ఆగేలోపే మహిళ కిందికి దిగడంతో అదుపుతప్పి కింద పడింది. కాలుపై నుంచి బస్సు వెనుక చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నర్సాపూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి బస్సుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



ప్రస్తుత సమాజంలో మనుషులు ఉరుకులు.. పరుగుల జీవితం గడుపుతున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం లేదు. దీంతో అనారోగ్యం పాలై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. శారీరక శ్రమ లేకపోవడంతో షుగర్‌, బీపీ తదితర వాటితో బాధపడుతున్నారు. పట్టణాలు, పల్లెల ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం ఉచిత యోగాను ప్రవేశపెట్టింది. ఇందుకోసం ఆయుష్‌ మిషన్‌ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 421 ఆయుష్‌ వైద్య ఆరోగ్య కేంద్రాల్లో యోగా కేంద్రాలను మంజూరు చేసింది. ఆయుష్‌ ఆస్పత్రులకు అనుబంధంగా నిర్మించిన యోగా కేంద్రాలు చాలా వరకు నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది. – మెదక్‌ డెస్క్‌

యోగం లేదా..?

నిరుపయోగంగా యోగా కేంద్రాలు

- ఆయుష్‌ మిషన్‌ ద్వారా ఉమ్మడి మెదక్‌ జిల్లాకు 45 మంజూరు
- ఒక్కొక్క కేంద్రానికి రూ.6 లక్షలు కేటాయింపు
- 37 నిర్మాణాలు పూర్తి. నిర్మాణాలు ప్రారంభం కానివి ఏడు
- ప్రజలకు అందని ఉచిత యోగా సేవలు



తొగుటలో ప్రారంభానికి నోచుకోక పిచ్చి మొక్కల మధ్య యోగా కేంద్రం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ యోగా కేంద్రాలకు భారీగా ఖర్చు చేస్తున్నారు. ఒక్కొక్క యోగా కేంద్రం షెడ్‌ నిర్మాణానికి రూ.6లక్షల చొప్పున మొత్తం రూ 2.7 కోట్ల నిధులు విడుదల చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్మాణ బాధ్యతలను ఆర్‌అండ్‌బీ, పీఆర్‌, టీఎస్‌ఎంఐడీసీలకు అప్పగించారు. ఉమ్మడి మెదక్‌ జిల్లాకు 45 మంజూరుకాగా అందులో ఇప్పటి వరకు 37 నిర్మాణం పూర్తి అయ్యాయి. ఇంకా ఒక్కటి నిర్మాణం జరుగుతుండగా, మరో 7 కేంద్రాల నిర్మాణాలే ప్రారంభం కాలేదు. తొలుత ప్రతీ యోగా కేంద్రానికి ఇద్దరు ఆశా వర్కర్లకు శిక్షణ ఇప్పించాలని భావించారు. ఇప్పటి వరకు ఆశావర్కర్లను ఎంపిక చేయలేదు. వారికి ఎలాంటి శిక్షణ ఇప్పించలేదు.

నెలలు గడుస్తున్నా..

యోగా శిక్షణ కోసం నిర్మించిన షెడ్‌ల నిర్మాణాలు పలు చోట్ల పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడంలేదు. కొన్ని జిల్లాల్లో ఏడాది క్రితం, మరికొన్ని జిల్లాల్లో 8 నెలల క్రితం నిర్మాణాలు పూర్తయినప్పటికీ యోగా శిక్షకులను నియమించకపోవడంతో తెరచుకోవడం లేదు. యోగా శిక్షణ కోసం నిర్మించిన షెడ్‌లు వినియోగంలో లేకపోవడంతో పలు చోట్ల స్టోర్‌ రూంలుగా, మరికొన్ని చోట్ల షెడ్‌ చుట్టూ పక్కల పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి ఇప్పటికైనా అధికారులు స్పందించి యోగా శిక్షణ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా..

జిల్లా పేరు	మంజూరు	పూర్తి	పురోగతిలో..	నిర్మాణం కానివి
సంగారెడ్డి	15	15	0	0
మెదక్‌	14	09	0	05
సిద్దిపేట	16	13	01	02
మొత్తం	45	37	01	07

త్వరలో ప్రారంభిస్తాం

త్వరలో యోగా కేంద్రాలను ప్రారంభిస్తాం. కమిషనర్‌ ఆదేశాలతో ఆశా వర్కర్‌లకు శిక్షణ ఇప్పించి వారితో యోగా శిక్షణ ఇప్పించేందుకు నిర్ణయం తీసుకుంటాం. వరంగల్‌ జోన్‌ పరిధిలో యోగా కేంద్రాల నిర్మాణం కోసం కలెక్టర్‌ ఆధ్వర్యంలోనే నిర్మాణ బాధ్యతలను అప్పగించాం. మంజూరైన నిధులను ఆయా శాఖలకు అందించాం.

– రవికుమార్‌, ఆర్‌డీడీ, ఆయుష్‌

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

- కబడ్డీ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉషి రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న ఉషి రెడ్డి

పటాన్‌చెరుటౌన్‌: గ్రామీణ కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యమని వరల్డ్‌ కబడ్డీ ఫెడరేషన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, కబడ్డీ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉషి రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌ చౌరస్తాలో జిల్లా సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కబడ్డీ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడిగా గడీల శ్రీకాంత్‌ గౌడ్‌, ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌ రెడ్డి, మహేశ్వర్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయి రెడ్డి, జాయింట్‌ సెక్రటరీ సాయి కుమార్‌ గౌడ్‌, జాయింట్‌ సెక్రటరీ తిరుపతి, ట్రెజరర్‌ ధన్‌రాజ్‌, కార్యదర్శులను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి, కబడ్డీ అసోసియేషన్‌ రాష్ట్ర జాయింట్‌ సెక్రటరీ రవిచందర్‌, హైదరాబాద్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుగు వివేకానంద రెడ్డి, జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జులాయిగా తిరుగొద్దని మందలింపు

- యువకుడి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



వినయ్‌ (ఫైల్‌)

రాయపోలు(దుబ్బాక): జులాయిగా తిరగొద్దని తల్లిదండ్రులు మందలించినందుకు యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన రాయపోలు మండలం ఎల్కల్‌లో చోటు చేసుకుంది. బేగంపేట ఎస్సై అరుణ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కల్‌కు చెందిన ఎల్లొల్ల చంద్రం కుమారుడు వినయ్‌ (16) చదువు మానేసి ఖాళీగా తిరుగుతున్నాడు. స్నేహితులతో జులాయిగా తిరగొద్దని, ఏదైనా పనిచేసుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన వినయ్‌ డిసెంబర్‌ 29న గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో గడ్డి మందు తాగాడు. విషయాన్ని తన వాట్సాప్‌ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. గమనించి స్నేహితులు కుటుంసభ్యులకు సమాచారం అందించి వెంటనే గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కుంటలో పడి మహిళ మృతి

గజ్వేల్‌రూరల్‌: కుంటలో పడి ఓ మహిళ మృతి చెందింది. గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన బొబ్బిలి శాలవ్వ(47) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి ఇబ్బంది పడుతుంది. బుధవారం బీడీ కాలనీకి సమీపంలోని రాజిరెడ్డిపల్లి కుంటవైపు వెళ్తుంది. ఈ క్రమంలో శాలవ్వను కుటుంబ సభ్యులు వారిస్తున్నా అలాగే వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి చనిపోయింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



మహిపాల్‌ (ఫైల్‌)

హవేళీఘణాపూర్‌(మెదక్‌) : ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్‌ మండల పరిధిలోని మగ్దుంపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి శెట్టి లక్ష్మీబీరప్ప ఏకైక కుమారుడు మహిపాల్‌ (21)కి 8 నెలల క్రితం చిన్నశంకరంపేట మండలం టి.మాందాపూర్‌ గ్రామానికి చెందిన దీపికతో వివాహమైంది. వివాహమైన ఐదు నెలలు సంసారం సాఫీగానే సాగింది. మూడు నెలల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. అయినప్పటికీ భార్య రావడం లేదని మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్‌రూరల్‌ పోలీసులు తెలిపారు.

సైబర్‌ వలలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి

- టాస్క్‌లు, కమీషన్‌ల పేరుతో మోసం
- రూ.4.52 లక్షలు పోగొట్టుకున్న వైనం
- మరో ఇద్దరు బాధితుల నుంచి రూ.2.07 లక్షలు వసూలు



పటాన్‌ చెరు టౌన్‌: సైబర్‌ వలలో పడి ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి రూ.4.52 లక్షలు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్‌ పరిధిలోని గ్రీన్‌విలాస్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగికి పార్ట్‌ టైం జాబ్‌ అంటూ డిసెంబర్‌ 18వ తేదీన వాట్సాప్‌కు మెసేజ్‌ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి వివరాలను నమోదు చేశాడు. సైట్‌ నిర్వాహకులు అతడికి ఒక వ్యాలెట్‌ ఐడీ క్రియేట్‌ చేసి ఇచ్చారు. ఉద్యోగి ముందుగా రూ.3 వేలు చెల్లించి ఇచ్చిన టాస్క్‌లు చేయడం మొదలు పెట్టాడు. తాను పెట్టిన నగదును సైబర్‌ నేరగాళ్లు వ్యాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ మేరకు బాధితుడు మొత్తం రూ. 4.52 లక్షలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్‌ ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్‌ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరెంట్‌ బిల్లు లింక్‌ క్లిక్‌ చేసి..

అదే విధంగా అమీన్‌పూర్‌ పరిధిలోని ఉసుకేబాయికి చెందిన ఓ వ్యక్తికి డిసెంబర్‌ 2వ తేదీన విద్యుత్‌ బిల్‌ కట్టలేదని ఫోన్‌ కాల్‌ వచ్చింది. ఆ వ్యక్తి అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా టీం వివర్‌ లింక్‌ను క్లిక్‌ చేశాడు. వెంటనే బాధితుడి ఫోన్‌ అపరిచిత వ్యక్తి ఆధీనంలోకి వెళ్లింది. బాధితుడు ఖాతాలో ఉన్న రూ.1.51 లక్షల నగదును మాయం చేశారు. ముందుగా సదరు వ్యక్తి సైబర్‌ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసి, బుధవారం అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పర్సనల్‌ లోన్‌ ఇప్పిస్తానని..

అమీన్‌పూర్‌ మండల పరిధిలోని పటేల్‌గూడా సిద్దార్థ నగర్‌ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి గతేడాది మార్చి 24వ తేదీన పర్సనల్‌లోన్‌ ఇస్తామంటూ ఫోన్‌కాల్‌ వచ్చింది. అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా బాధితుడు ముందుగా రూ.16 వేలు, తర్వాత రూ.40 వేలు వేశాడు. అపరిచిత వ్యక్తిని లోన్‌ ఇప్పించకపోవడంతో బాధితుడు తాను మోసం పోయినట్లు గుర్తించి సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫేస్‌బుక్‌లో స్కూటీ కొందామని ..

హత్నూర(సంగారెడ్డి): ఆన్‌లైన్‌ మోసానికి మరో యువకుడు బలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. హత్నూర మండలం కోన్యాల గ్రామానికి చెందిన చిలిపిచెడ్‌ నవీన్‌ మంగళవారం ఫేస్‌బుక్‌లో అమ్మకానికి పెట్టిన స్కూటీ వాహనాన్ని చూశాడు. అక్కడ ఉన్న నంబర్‌కు ఫోన్‌ చేయగా స్కూటీ ధర రూ.18,000 అని తెలిపాడు. వాట్సాప్‌కు ఆర్సీ పంపగా, అన్ని సరిగానే ఉన్నాయని నవీన్‌ అమ్మకందారుడి ఫోన్‌ పే నంబర్‌కు డబ్బులు పంపాడు. అయితే, ఆ డబ్బులు అకౌంట్‌లో కనిపించడం లేదని మరో రూ.13,000 పంపితే కనిపిస్తాయని చెప్పడంతో మళ్లీ డబ్బులు వేశాడు. ఇలా నాలుగు దఫాలుగా రూ.75 వేల వరకు పంపాడు. స్కూటీ కోసం ఫోన్‌ చేయగా ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ వచ్చింది. దీంతో తాను మోసపోయానట్లు భావించిన యువకుడు వెంటనే 1903కి ఫోన్‌ చేసి సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పార్ట్‌ టైం జాబ్‌ పేరుతో టోకరా..

సిద్దిపేటఅర్బన్‌: సైబర్‌ నేరాలపై పోలీసులు ఎంత ప్రచారం చేస్తున్నా అమాయకులు బలి అవుతూనే ఉన్నారు. తాజాగా సిద్దిపేట త్రీటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో రెండు సైబర్‌ క్రైమ్‌ ఘటనలు వెలుగు చూశాయి. వర్క్‌ ఫ్రం హోమ్‌, పార్ట్‌ టైం జాబ్‌ ఉందని అపరిచిత వ్యక్తి బాధితుడికి ఫోన్‌ చేయగా బయోడేటా, బ్యాంకు వివరాలు పంపించాడు. అకౌంట్‌ తెరవడానికి డబ్బులు పంపించాలని అపరిచిత వ్యక్తి చెప్పగా ఫోన్‌పే, గూగుల్‌ పే ద్వారా రెండు విడతలుగా రూ. 35 వేలు పంపించాడు. ఆ తర్వాత ఫోన్‌ చేస్తే స్విచ్ఛాఫ్‌ రావడంతో అనుమానం వచ్చి 1930 కి కాల్‌ చేసి ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో బాధితుడికి సైబర్‌ నేరస్తుడు ఫోన్‌ చేసి తక్కువ ధరకు ఫర్టిలైజర్స్‌, ఫెస్టిసైడ్స్‌ సరఫరా చేస్తామని, హోల్‌సేల్‌ షాపు కోసం లైసెన్స్‌ ఇప్పిస్తామని చెప్పారు. నమ్మిన బాధితుడు అడ్వాన్స్‌గా రూ.60,500 ఫోన్‌ పే ద్వారా పంపించాడు. ఆ తర్వాత అపరిచిత వ్యక్తికి ఫోన్‌ చేయగా స్పందించలేదు. దీంతో హెల్ప్‌లైన్‌కు కాల్‌ చేసి ఫిర్యాదు చేశాడు.

భార్య, అత్తపై కత్తితో దాడి

- అత్త మృతి, భార్య పరిస్థితి విషమం
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు
- పటాన్‌చెరులో ఘటన



శాంతమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పటాన్‌చెరు సీఐ లాలూ నాయక్‌

పటాన్‌చెరు టౌన్‌: భార్య, అత్తను భర్త విచక్షణ రహితంగా కత్తితో పొడిచాడు. అత్త అక్కడికక్కడే మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన సాయిబాబాతో మండలంలోని ఇస్నాపూర్‌ గ్రామానికి చెందిన సత్యవతి (22)కి 2021 జనవరిలో వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తలు తరచూ గొడవపడుతుండడంతో మహిళా పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్‌ కూడా నిర్వహించారు. కాగా, బుధవారం సాయంత్రం పటాన్‌ చెరు మండలం ఇస్నాపూర్‌ పద్మారావు కాలనీలో ఉండే అత్త శాంతమ్మ (43), భార్య సత్యవతి (22) పై సాయిబాబా కత్తితో విచక్షణ రహితంగా దాడి చేశాడు. అత్తను కడుపులో పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డొచ్చిన భార్య మెడపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పటాన్‌చెరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సత్యవతి పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శాంతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. వీరికి రెండేళ్ల పాప, ఆరు నెలల బాబు ఉన్నాడు. మృతురాలు శాంతమ్మ భర్త శంకర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సీఐ లాలూ నాయక్‌ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



శాంతమ్మ

రారండోయ్‌ వేడుక చూద్దాం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం, జాతరకు సర్వం సిద్ధం అవుతుంది. ప్రతీయేటా మార్గశిర మాసం చివరి ఆదివారం నిర్వహించే స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఫాల్గుణ మాసం చివరి ఆదివారం నిర్వహించే అగ్నిగుండాలతో జాతర ముగుస్తుంది. ఈ నెల 7వ తేదీన ప్రారంభమై ఏప్రిల్‌ 8వ తేదీతో జాతర ముగుస్తుంది. మూడు నెలలపాటు బ్రహ్మోత్సవాలు జరిగే ఏకైక శైవక్షేత్రంగా కొమురవెల్లి ప్రసిద్ధిగాంచింది. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్‌, కర్ణాటక నుంచి భక్తులు భారీగా తరలివస్తారు.

– సాక్షి, సిద్దిపేట

7వ తేదీన మల్లన్న కల్యాణం

- ఏప్రిల్‌ 8వ తేదీ వరకు జాతర
- తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే విధంగా బ్రహ్మోత్సవాలు
- మార్చి 8న మహాశివరాత్రి సందర్భంగా పెద్ద పట్నం
- ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న ఆలయ నిర్వాహకులు



కొమురవెల్లి దేవాలయం

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లిలోని కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం. ఆలయంలో వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం శ్రీమల్లికార్జున స్వామి, ఆయన సతీమణులు లింగ బలిజల ఆడబిడ్డ అయిన బలిజ మేడలమ్మ, యాదవుల ఆడబిడ్డ అయిన గొల్లకేతమ్మ నిత్యం పూజలందుకుంటున్నారు. ఇతర ఏ శైవక్షేత్రంలోనూ లేని విధంగా ఇక్కడ స్వామి ఇరుపక్కలా అమ్మవార్ల స్వరూపాలతో దర్శనమిస్తారు. ఈ క్షేత్రంలోని శ్రీమల్లన్న నాభిలో పుట్టలింగం ఉందని ప్రతీతి.

రెండు పద్ధతుల్లో కల్యాణం

కొమురవెల్లి జాతర మూడు నెలల పాటు కొనసాగుతుంది. స్వామి వారి కల్యాణం రెండు పద్ధతుల్లో జరుగనుంది. ఏటా మార్గశిర మాసం చివరి ఆదివారం (ఈ నెల 7న) వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణోత్సవం నిర్వహిస్తారు. మార్చి 8న మహాశివరాత్రిని పురస్కరించుకొని యాదవ సాంప్రదాయం ప్రకారం స్వామి వారి కల్యాణం (పెద్ద పట్నం) నిర్వహించనున్నారు. సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారం నుంచి ఫాల్గుణ మాసం చివరి ఆదివారం వరకు ఏప్రిల్‌ 8వ తేదీ వరకు 12 వారాల పాటు జాతర జరుగనుంది. ఆలయవర్గాలు స్వామివారి కల్యాణ ఆహ్వాన పత్రికలను సీఎం రేవంత్‌ రెడ్డి, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, దాతలు, అధికారులు, భక్తులకు పంపిణీ చేస్తున్నారు.

బ్రహ్మోత్సవ కార్యక్రమాలు..

- ఈనెల 7వ తేదీన ఉదయం 10 :45 గంటలకు స్వామి వారి కల్యాణం
- 8న స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన కార్యక్రమం ఉంటుంది.
- మార్చి 8న మహాశివరాత్రి సందర్భంగా పెద్ద పట్నం వేస్తారు.
- 9న ఏకాదశ రుద్రాభిషేకం, అన్నపూజ
- ఏప్రిల్‌ 7న అగ్నిగుండ ప్రజ్వలన, 8న అగ్నిగుండ ప్రవేశంతో ముగింపు

వైభవంగా నిర్వహిస్తాం

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కల్యాణం వైభవంగా నిర్వహిస్తాం. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. బ్రహ్మోత్సవాలకు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వస్తుంటారు.

– బాలాజీ, ఈఓ

పెండ్లిపిలుపు

వరుడు : శ్రీ మల్లికార్జున స్వామి
వధువులు : శ్రీ మేడలాదేవి–శ్రీ కేతమ్మదేవి
సుముహూర్తం : స్వస్తిశ్రీ శోభకృత్‌ నామ సంవత్సరం మార్గశిర మాసం ఏకాదశి(ఈ నెల 7వ తేదీన ఆదివారం), ఉదయం : 10–45 గంటలకు
కల్యాణ వేదిక : ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలోని తోట బావి వద్ద నిర్మించిన కల్యాణ వేదిక
కన్యాదాతలు : మహదేవుని వంశస్తులు
స్వీకర్తలు : పడిగన్నగారి వంశస్తులు
వేద పర్యవేక్షణ : 1008 వీరశైవ పీఠాధిపతి మణికంఠ శివాచార్యుల ఆధ్వర్యంలో
పురోహితులు : నడిపుడి మఠం భవానయ్య స్వామి,భువ నేశ్వరస్వామి, ఆనందయ్య, జ్ఞానశ్వర్‌శాస్త్రి, చంద్రశేఖర్‌స్వామి, భద్రయ్యస్వామి
వ్యాఖ్యాతలు : డాక్టర్‌ మహంతయ్య, నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి స్వామిజీలు
ముఖ్యఅతిథులు: స్వామి వారి భక్తులు
ఆహ్వానితులు : ఆలయ కార్యనిర్వహణధికారి, వీరశైవ అర్చక, ఒగ్గుపూజారుల బృందం, ఆలయ సిబ్బంది.

